సాక్షి ఖమ్మం

ఆదివారం ǀ 21 ǀ సెప్టెంబర్ ǀ 2025



ప్రకృతి ఆరాధన.. బతుకమ్మ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను నేటి నుంచి జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. 10లో



యూరియా కోసం ఆందోళన

బోనకల్ మండలం రావినూతల పీఏసీఎస్ వద్ద శనివారం యూరియా కోసం రైతుల మధ్య తోపులాట, ఆందోళన జరిగాయి. 10లో



వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం పలుచోట్ల ఆకాశం మేఘావృతమై జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

22, 23 తేదీల్లో మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంఅర్బన్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమ, మంగళవారాల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. 22న ఉదయం 11 గంటలకు రఘునాథపాలెం మండలం లచ్చిరాం తండాలో బ్రిడ్జి నిర్మాణం, ఈర్లపూడి వరకు రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 5గంటలకు ఖమ్మం కార్పొరేషన్ 12వ డివిజన్ మైత్రీ నగరంలో పెట్‌పార్క్ ప్రారంభం, వరదయ్యనగర్‌లో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 23న ఉదయం 9గంటలకు 6వ డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేయనున్నారు.

రేపు ఉమ్మడి జిల్లా ఉషూ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా పాఠశాలలు, జూనియర్ కళాశాలల క్రీడా సంఘాల సంయుక్త ఆధ్వర్యాన ఉమ్మడి జిల్లాస్థాయి బాలబాలికల అండర్–17, 19 ఉషూ జట్ల ఎంపిక పోటీలు సోమవారం నిర్వహిస్తున్నట్లు సంఘాల బాధ్యులు పి.వెంకటేశ్వర్లు, నరేష్‌కుమార్, ఎం.డీ.మూసా కలీం తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అండర్–17 విభాగంలో బాలబాలికలు 2009 జనవరి తర్వాత, అండర్–19 విభాగంలో 2007 జనవరి తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు వయసు ధ్రువపత్రాలతో పాటు ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్ తీసుకురావాలని, వివరాలకు 99481 99743, 98662 90609 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మైనార్టీల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన, రేవంతన్న కా సహారా పథకాల అమలుకు అర్హులైన మైనార్టీ మహిళలు, ఫకీర్, దూదేకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ తెలిపారు. మహిళా యోజన పథకం కింద వితంతువులు, విడాకులు పొందిన వారు, అనాథలు, అవివాహిత మహిళలు చిన్న వ్యాపారాలు చేసుకునేందుకు రూ.50 వేల చొప్పున సాయం అందుతుందని చెప్పారు. అలాగే, రేవంతన్న కా సహారా పథకం కింద ఫకీర్, దూదేకుల వర్గాలకు మోపెడ్‌వాహనాల కోసం రూ.లక్ష అందజేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు https://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 97040 03002 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇసుక అక్రమ రవాణాకు చెక్

జిల్లా సరిహద్దుల్లో 15 చెక్‌పోస్టులు

ఖమ్మంక్రైం: ఆంధ్రప్రదేశ్ నుంచి జిల్లాలోకి అక్రమంగా ఇసుక రవాణా జరగకుండా జిల్లా సరిహద్దుల్లో 15 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరిగే ఇసుక రవాణాను పూర్తి స్థాయిలో నిర్మూలించేలా ఆయా చెక్‌పోస్టుల్లో పోలీస్, మైనింగ్ తదితర శాఖల అధికారులు తనిఖీలు చేపడతారని వెల్లడించారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నందున ఎలాంటి అక్రమాలకు తావుండదని తెలిపారు. కాగా, ఏపీ నుంచి ఇసుక రవాణా చేసే వాహనాలపై కేసులు నమోదు చేయడమే కాక వాహనాలను జప్తు చేయాలని, స్థానిక పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు కూడా నిఘా పెట్టాలని సూచించారు. సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్ పోస్టుల వద్ద మూడు షిఫ్టుల్లో ఉద్యోగులు 24 గంటలూ విధులు నిర్వర్తిస్తారని సీపీ తెలిపారు.

అక్రమార్కుల చెరలో..



మున్నేరులోకి నిర్మించిన రహదారిని జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

మున్నేరు భూములను పట్టా చేసుకుని ఇసుక దందా

- రఘునాథపాలెంలో గుట్టలను కొల్లగొట్టిన ఘనుడే ఈ దందాకు సారథ్యం
- ఏటికే గేట్లు పెట్టి ఇందిరమ్మ లబ్ధిదారుల నుంచి వసూళ్లు
- 'సాక్షి' కథనానికి స్పందించిన అధికారులు
- చిన్నమండవ మున్నేరు ప్రాంతం పరిశీలన



మున్నేరు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్‌డీసీ రాజేశ్వరి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: అక్రమార్కుల చెరలో మున్నేరు విలవిల్లాడుతోంది. ఇసుక అక్రమ దందాకు మున్నేరు అడ్డాగా మారింది. ముదిగొండ మండలం గంగాపురం రెవెన్యూ పరిధిలో.. చింతకాని మండలం చిన్నమండవ మున్నేరు ప్రాంతంలో ఉన్న దాదాపు 70 ఎకరాల భూమిని కొంతమంది పట్టా చేయించుకున్నారు. ఈ భూముల్లో ఇసుక దందా నిర్వహిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. వీరికి అధికారుల అండదండలు ఉండడంతో మరింతగా రెచ్చిపోయి దందాకు తెరలేపారు. మున్నేరులోనే రహదారి నిర్మించి.. గేట్లు ఏర్పాటు చేసి మరీ దందా కొనసాగించారు. జిల్లాలోని రఘునాథపాలెం మండలంలో గత ప్రభుత్వ హయాంలో మట్టి గుట్టలను కొల్లగొట్టిన ఘనుడే ఈ దందాకు సారథ్యం వహించడం గమనార్హం. ఈ 70 ఎకరాలే కాకుండా మరో 80 ఎకరాలు కూడా తమ అధీనంలోకి తీసుకుని నిర్విఘ్నంగా ఇసుక అక్రమ రవాణా కొనసాగించడంపై శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన 'అంతా మా ఇష్టం' కథనానికి జిల్లా అధికారులు స్పందించారు.

ఆ ఘనుడి కన్ను పడి..

గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని రఘునాథపాలెం మండలంలోని మట్టి గుట్టలు కరిగిపోయాయి. ఈ గుట్టలను ఓ వ్యక్తి కొల్లగొట్టగా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో విచారణ నిర్వహించి జరిమానా విధించారు. ఆ తర్వాత ఈ ప్రబుద్ధుడి కన్ను మున్నేరు పరీవాహక ప్రాంతంలోని చింతకాని మండలం చిన్నమండవ వైపున్న భూములపై పడింది. ముదిగొండ మండలం గంగాపురం రెవెన్యూ పరిధిలో మున్నేరు సమీపంలో దాదాపు 1,257 ఎకరాలు ఉంది. ఇందులో కొంత చింతకాని మండలం చిన్నమండవ మున్నేరు ప్రాంతం వైపు ఉంది. సదరు వ్యక్తి మరో 13 మందితో కలిసి 2019 నుంచి 2023 వరకు 122 నుంచి 126 సర్వే నంబర్లలోని 70 ఎకరాలను కొనుగోలు చేసి యథేచ్ఛగా ఇసుక దందా కొనసాగిస్తున్నాడు.

అధికారుల పట్టింపులేక..

గత కొన్నేళ్లుగా కొంతమంది బృందంగా ఏర్పడి ఇసుక దందా కొనసాగిస్తున్నా.. అధికారులు మిన్నకుండిపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఏళ్లుగా ఈ వ్యవహారం అడ్డూ అదుపు లేకుండా సాగిస్తున్నా అధికారుల నిర్లక్ష్యం దేనికి సంకేతమనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మున్నేరులో రహదారి ఏర్పాటు చేసి, గేట్లు పెట్టి.. సీసీ కెమెరాలు అమర్చినా ఎందుకు స్పందించలేదనే చర్చ జరుగుతోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం చింతకాని మండలం చిన్నమండవ రీచ్‌నుంచి ఇసుక తరలించినా వసూళ్లకు పాల్పడటం గమనార్హం. ప్రకృతి సంపద ఇలా తరలిపోతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. ఈ ఆరోపణల నేపథ్యంలోనే చింతకాని తహసీల్దార్, ఎస్సైలపై వేటుపడింది.

మున్నేటి ప్రాంతాన్ని సందర్శించిన అధికారులు..

చింతకాని మండలం చిన్నమండవ మున్నేరు ప్రాంతంలో నిర్వహిస్తున్న ఇసుక దందాపై శనివారం 'అంతా మా ఇష్టం' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా జిల్లా యంత్రాంగం స్పందించింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి శనివారం మున్నేరును పరిశీలించారు. మున్నేరులోకి నిర్మించిన రహదారిని తొలగించాలని ఆదేశించారు. సోమవారం ముదిగొండ, చింతకాని మండలాల సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేసేంతవరకు కూపన్లు పంపిణీ చేయొద్దని అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో చింతకాని, ముదిగొండ తహసీల్దార్లు దగ్గరుండి మున్నేరులోకి నిర్మించిన రహదారిని తొలగించారు. అలాగే కార్యాలయల్లో రికార్డులను పరిశీలిస్తున్నారు.

అసలేం జరిగిందంటే..

గంగాపురం రెవెన్యూ పరిధిలో చిన్నమండవ మున్నేరు ప్రాంతం వైపు ఉన్న సుమారు 70 ఎకరాల లంక భూములను 2013లో వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తులు కొనుగోలు చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందారు. ఇసుక వ్యాపారం కోసమే ఈ భూములను కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ భూములతోపాటు మరో 80 ఎకరాలు ఆక్రమించుకుని యథేచ్ఛగా ఇసుక వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇక 70 ఎకరాలు కొనుగోలు చేసిన నలుగురిలో ముగ్గురు 40 ఎకరాలను 2019 – 23 మధ్యన 13 మందికి విక్రయించారు. ఈ 13 మందితోపాటు 30 ఎకరాలున్న వ్యక్తి కలిపి ఇసుక దందా కొనసాగించారు. మున్నేరులోకే రహదారి నిర్మించి.. గేట్లు ఏర్పాటు చేసి, సీసీ కెమెరాలు అమర్చారు. రీచ్‌ల నుంచి ఇసుక కోసం వచ్చే వాహనాల నుంచి ఫీజు వసూలు చేయడం ప్రారంభించారు. ప్రతి ట్రాక్టర్‌కు రూ.1000 చొప్పున వసూలు చేశారు. ఈ మొత్తాన్ని 14మంది సమానంగా పంచుకున్నారు. దీంతో ఇసుక కోసం వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలి

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణా నియంత్రణకు ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన తన క్యాంప్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ తదితర అధికారులతో డీఎస్ఆర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న ఇసుక వనరులు, ఇతర గనుల వివరాల సర్వే రిపోర్టులు తయారు చేయాలన్నారు. ఇసుక, మట్టి అక్రమ రవాణాను పటిష్టంగా నియంత్రించాలని, పత్రికలలో వార్తలు వస్తున్నా స్పందించకపోవడం సరికాదని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కూడా అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలుస్తోందని, జారీ చేసిన అనుమతులు మేరకే ఇసుక రవాణా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ విషయంలో మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో సీపీఓ ఎ. శ్రీనివాస్, మైనింగ్ ఏడీ ఆర్.సాయినాథ్, టీజీఎండీసీ పీఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జాతీయ రహదారుల భూసేకరణ అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా కలెక్టర్ అనుదీప్ హాజరై మాట్లాడుతూ.. ఎన్‌హెచ్ 163జీ పరిధిలో ఖమ్మం జిల్లాలో కోర్టు స్టే ముగిసినందున 12 కిలోమీటర్ల మేర రోడ్డు వేసేందుకు 42 హెక్టార్ల భూసేకరణ వేగవంతంగా పూర్తి చేసి, అక్టోబర్ చివరి నాటికి ఎన్‌హెచ్ఏకు బదలాయిస్తామని తెలిపారు. వీసీలో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, ఎన్‌హెచ్ పీడీలు రామాంజనేయ రెడ్డి, దివ్య, ఈఈ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రీనివాసాచారి



కాకరవాయి సబ్‌స్టేషన్‌లో ఫీడర్ బ్రేకర్‌ను చార్జ్ చేస్తున్న ఎస్ఈ శ్రీనివాసాచారి

తిరుమలాయపాలెం : వినియోగదారులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి అన్నారు. మండలంలోని కాకరవాయి సబ్‌స్టేషన్‌లో జూపెడ ఫీడర్‌ను శనివారం సపరేట్ చేసి బ్రేకర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. గతంలో ఒక ప్రాంతంలో విద్యుత్ సమస్య వస్తే అన్ని ఫీడర్లు బంద్ చేయాల్సి వచ్చేదని, ప్రస్తుతం ఫీడర్ల వారీగా బ్రేకర్ల ఏర్పాటుతో సమస్య ఉన్నచోటే సరఫరా నిలిపేస్తున్నామని తెలిపారు.

విద్యుత్ కనెక్షన్ లేని ఇల్లు ఉండొద్దు

నేలకొండపల్లి : జిల్లాలో విద్యుత్ కనెక్షన్ లేని ఇల్లు ఉండకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని శ్రీనివాసాచారి అన్నారు. మండలంలోని తిరుమలాపురం అంగన్‌వాడీ కేంద్రానికి జూగా పథకం కింద ఏర్పాటు చేసిన విద్యుత్ కనెక్షన్‌ను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో విద్యుత్ కనెక్షన్ లేని ఎస్సీ, ఎస్టీలకు ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. జన జీవనానికి దూరంగా ఉన్న వారిని గుర్తించి విద్యుత్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 149 కనెక్షన్లు అవసరమని గుర్తించామని, వాటలో ఖమ్మం డివిజన్‌లో 16, ఖమ్మం రూరల్ డివిజన్‌లో 12, సత్తుపల్లి డివిజన్‌లో 7 గ్రామాలు ఉన్నాయని వివరించారు.

విద్యుత్ లైన్ల పరిశీలన..

ముదిగొండ : మండలంలోని ముదిగొండ, వెంకటాపురం గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లను ఎస్ఈ శ్రీనివాసాచారి శనివారం పరిశీలించారు. కొన్నేళ్లుగా విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విడుదల చేసిన నిధులతో సమస్య పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ.. మధిర నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు భట్టి విక్రమార్క ప్రభుత్వం నుంచి రూ.9కోట్లు మంజూరు చేయించారని తెలిపారు. ఖమ్మం, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపించామని వివరించారు. నిధులు మంజూరు కాగానే అక్కడ కూడా పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు శ్రీనివాసాచారిని సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఖమ్మం రూరల్ డీఈ నాగేశ్వరరావు, భద్రు, బాబూరావు, ఏడీలు చక్రవర్తి, కోక్యానాయక్, ముదిగొండ ఏడీఏ రామకృష్ణ, ప్రొటెక్షన్ ఏఈలు కె.రామారావు, రమేష్, మునీర్‌పాషా, మేకపోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పగలు ఎండ.. సాయంత్రం వాన !

జిల్లాలో భిన్న వాతావరణం



ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. పగలంతా ఎండ కాస్తూ సాయంత్రం వర్షం పడుతోంది. రాత్రి వేళ చల్లదనం ఉంటుండగా, మధ్యాహ్నం ఎండ దంచికొడుతోంది. శుక్రవారం వరకు జిల్లాలో గరిష్టంగా 32 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, శనివారం 38 డిగ్రీలకు చేరువైంది. ఖమ్మం ఖానాపురంలో గరిష్టంగా 37.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, బచ్చోడులో 37.3, వైరా ఏఆర్ఎస్ వద్ద 37.2, ఖమ్మం ప్రకాష్‌నగర్, తల్లాడల్లో 37.1, మధిర, తిరుమలాయపాలెంలో 37, సత్తుపల్లి ఓసీ, రావినూతల, కుర్నవల్లి, వైరాలో 36.9, పంగిడి, పల్లెగూడెం, మధిర(ఏఆర్ఎస్), కల్లూరులో 36.8, రఘునాథపాలెం, ఏన్కూరు, ఖమ్మం ఎన్ఎస్‌పీ గెస్ట్ హౌస్, సత్తుపల్లి, కొణిజర్లలో 36.7, నాగులవంచ, కాకరవాయిలో 36.6, మంచుకొండ, పెద్దగోపతి, గేటు కారేపల్లి, కలక్టరేట్‌లో 36.5, పెనుబల్లి, ఎర్రుపాలెం, సిరిపురం, ముదిగొండలో 36.4, చింతకాని, లింగాల, గుబ్బగుర్తిలో 36.2, గంగారం, నేలకొండపల్లి, పమ్మిలో 36.1 వేంసూరులో 35.7, తిమ్మారావుపేటలో 35.5, సదాశివునిపాలెంలో 35.4, కూసుమంచిలో 35.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక సాయంత్రం 6 గంటల నుంచి పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. పగటి వాతావరణం ఎండాకాలాన్ని తలపిస్తుండగా ఫ్యాన్లు, ఏసీల వినియోగం పెరుగుతోంది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా వరికి తెగుళ్లు ఆశిస్తుండగా ఉద్యాన పంటలపైనా ప్రభావం పడుతోంది.

పలు ప్రాంతాల్లో వాన..

పలు ప్రాంతాల్లో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చింతకానిలో అధికంగా 38.3 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, సిరిపురంలో 24.5, పెద్దగోపతిలో 15.3, ముదిగొండ, రావినూతలలో 15, కూసుమంచిలో 13.5, ఖమ్మం ఎన్ఎస్‌పీ గెస్ట్‌హౌస్ వద్ద 10, ఏన్కూరులో 9.8, పల్లెగూడెంలో 7.8, మధిరలో 6.8, ఖమ్మం ఖానాపురంలో 5.8, తిరుమలాయపాలెం, మధిరలో 5, రఘునాథపాలెంలో 4.8, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 4.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న విజయలక్ష్మి

ఖమ్మంరూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన, తర్ఫీదు పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, తద్వారా నాణ్యమైన బోధన అందుతుందని విద్యాశాఖ రాష్ట్ర పరిశీలకులు, ఎస్ఐఈటీ డైరెక్టర్ ఎస్.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని జలగంనగర్ ఉన్నత పాఠశాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తల్లిదండ్రులు నిర్భయంగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకుంటారని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సాయంత్రం బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్యాంసన్, సీసీ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం శ్రీవారికి చందన అలంకారం, సర్వాంగ అభిషేకం, తీర్థపు బిందె తోడ్కొని రావడం, శ్రీస్వామి, అమ్మవార్ల యాగశాల ప్రవేశం ఉంటాయని, కలశస్థాపన, గణపతి హోమంతో ప్రారంభమయ్యే ఉత్సవాలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దంపతులు జ్యోతి ప్రజ్వలన చేస్తారని ఈఓ జగన్మోహన్‌రావు తెలిపారు. 23న గణపతి హోమం, అమ్మవారికి శ్రీబాలాత్రిపుర సుందరీ అలంకరణ, 24న శ్రీగాయత్రిదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. 25న శ్రీఅన్నపూర్ణాదేవిగా, 26న శ్రీమహాలక్ష్మీదేవిగా, 27న శ్రీలలితా పరమేశ్వరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని, 28న శ్రీచండీ అలంకారం, 29న శ్రీసరస్వతీ దేవి అలంకరణ, 30న శ్రీదుర్గాదేవి అలంకారం, అక్టోబర్ 1న శ్రీమహిషాసురమర్దనిగా అమ్మవారిని అలంకరిస్తామని వివరించారు. 2వ తేదీన చండీహోమం, మహాపూర్ణాహుతి, శమీ పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు శ్రీవారిని, శ్రీఅలివేలు మంగ, శ్రీపద్మావతి అమ్మవార్లను దర్శించుకోవాలని ఈఓ కోరారు.

మావాడే.. వదిలేయ్!

- పోలీసులపై రాజకీయ నేతల ఒత్తిళ్లు
- లైసెన్స్ లేదని బండి ఆపినా ఫోన్లు
- కింది స్థాయి ఉద్యోగులు నిరాకరిస్తే ఆపై స్థాయిలో పైరవీలు
- ఏం చేయాలో పాలుపోక ఉద్యోగులకు తలనొప్పి



ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిత్యం జరుగుతున్న తంతే ఇది.

ఖమ్మంక్రైం: ఖమ్మం బైపాస్‌రోడ్డులో ఓ ఎస్ఐ స్థాయి అధికారి ఇటీవల వాహన తనిఖీలు చేపడుతున్నారు. ద్విచక్ర వాహనంపై ముగ్గురు వెళ్తుండగా ఆపి పరిశీలించగా లైసెన్స్, ఆర్‌సీ లేదని.. అసలు వాహనమే తమది కాదని బదులిచ్చారు. దీంతో ఆ ఎస్ఐ వాహనాన్ని పక్కన పెట్టించారు. అయితే, యువకులు ఎవరికో ఫోన్ చేయగా.. కొద్దిసేపటికే అధికార పార్టీ కార్పొరేటర్ నుంచి ఎస్ఐకి ఫోన్ వచ్చింది. 'ఆ ముగ్గురు మా వాళ్లే వదిలేయ్' అని సూచిస్తే ఎస్సై లైసెన్స్ లేదని చెబుతున్నా వినకుండా పై అధికారితో మాట్లాడుతానంటూ ఫోన్ కట్ చేశాడు. అనుకున్నట్టుగానే పై అధికారి నుంచి ఎస్సైకి ఫోన్ రావడంతో ఆ ముగ్గురిని వదిలేయగా ఒకే బండిపై ట్రిపుల్ రైడింగ్‌గా పోలీసుల ముందే కాలర్ ఎగురవేసుకుంటూ వెళ్లిపోయారు. అదే సమయాన ఎలాంటి పైరవీలు లేని కొందరు వాహనదారులు జరిమానా చెల్లించి వెళ్లారు. దీంతో సామాన్యులకు ఓ న్యాయం, పైరవీలు ఉంటే ఇంకో తీరేంటని నిట్టూర్చారు అక్కడున్నవారు. ఈ ఘటన ఒకటే కాదు.. ఖమ్మం జిల్లా కేంద్రంలోని నాలుగు పోలీస్‌స్టేషన్లతో పాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిత్యం జరుగుతున్న తంతే ఇది.

చిన్న పాముకూ పెద్ద కర్రే

నిబంధనలకు విరుద్ధంగా డీజే పెట్టి నృత్యాలు చేసే వారిపై ఫిర్యాదు అందితే పోలీసులు వాహనాన్ని స్టేషన్‌కు తరలిస్తారు. ఆ వెంటనే ఓ రాజకీయ నాయకుడు వచ్చి కీలక ప్రజాప్రతినిధికి దగ్గరి మనిషినంటూ డీజే వాహనం, నిర్వాహకులను తీసుకెళ్లడం పరిపాటిగా మారింది. వాహనం బయటకు వెళ్లగానే మళ్లీ పాటలతో హోరెత్తిస్తుండడంతో పోలీసులు ఉసూరుమనడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. ఇక ద్విచక్ర వాహనాలను ఆపినా, జరిమానా కట్టాలని అడిగినా కొందరు రాజకీయ నాయకులు రంగంలోకి దిగుతుండడం పోలీసులకు తలనొప్పిగా మారింది. ఏం చేయాలో పాలుపోని స్థితి ఎదుర్కొంటుండగా.. ఇలాంటి వారితో ఇబ్బంది పడుతున్న సామాన్యులకు సమాధానం చెప్పలేకపోతున్నామని వారు మథనపడుతున్నారు.

పనిచేయకుంటే పోస్టింగ్ మార్పు..

'చెప్పిన పని చేయకపోతే తమ ప్రజాప్రతినిధికి చెప్పి పోస్టింగ్ మార్పిస్తాం.. ఇందుకోసం పై అధికారులతో మాట్లాడుతాం' అంటూ ఖమ్మంలోని కొందరు ఉద్యోగులపై రాజకీయ నాయకులు ఒత్తిడి తెస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఫలితంగా రోడ్లపై ఆకతాయిలుగా తిరుగుతూ ప్రజలను ఇబ్బంది పెడుతున్న వారికి కనీసం కౌన్సెలింగ్ ఇవ్వలేకపోతున్నామని చెబుతున్నారు. ఇదే అదునుగా ఆకతాయిలు మరింత రెచ్చిపోయి తామేం చేసినా నాయకులు అండగా నిలుస్తున్నారనే ధీమాతో పోలీసుల ముందే చెలరేగిపోతున్నారు. ఇందులో కొందరు గంజాయి అమ్మకం, వాడకందారులు కూడా ఉండగా.. పోలీసులు ఏమీ చేయలేని పరిస్థితి ఎదురవుతోంది. రాజకీయ నాయకులు ఆకతాయిలకు అండగా నిలవడం వల్లే ఈ పరిస్థితి ఎదురవుతోందని చెబుతున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆకతాయిలు కాస్తా అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదముందని రిటైర్డ్ పోలీస్ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. పోలీసుల విధుల్లో జోక్యం చేసుకోకుండా ఉంటేనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని ఆయన చెప్పడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది.

క్లుప్తంగా

సేవాభావం పెంపొందించుకోండి..



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తిరుమలాయపాలెం: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు సేవా దృక్పథం, సామాజిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవాలని ఎన్ఎస్ఎస్ జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని ఎదుళ్లచెరువులో పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించనున్న శీతాకాల ప్రత్యేక శిబిరం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. వారం పాటు నిర్వహించనున్న శిబిరంలో విద్యార్థులు సమస్యలను గుర్తించి ప్రజలను చైతన్య పరచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సిలార్ సాహెబ్, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ వాసిరెడ్డి శ్రీనివాస్, మనోహర్‌రాజు, ఏవీ నాగేశ్వరరావు, బోడా మంగీలాల్, రవి, నారాయణరావు, చంద్రమౌళి, కమతం వెంకటేశ్వర్లు, కాంపాటి శ్రీనివాసరావు, నేరడి సత్యం పాల్గొన్నారు.

కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ పరిశీలన

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లిలోని సింగరేణి జేవీఆర్ ఓసీ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌ను సింగరేణి డైరెక్టర్ ఎం.తిరుమల్‌రావు పరిశీలించారు. బొగ్గు రవాణా, నిర్వహణలో ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. శైలోర్యాపిడ్ లోడింగ్ సిస్టమ్, డీఎఫ్‌డీఎస్ సిస్టం, విండ్ బ్యారియర్‌లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం సింగరేణి డైరెక్టర్ తిరుమల్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో సీహెచ్‌పీ జీఎం రామమూర్తి, పీఓ ప్రహ్లాద్, ఇంజనీర్ సూర్యనారాయణరాజు, సోమశేఖర్‌రావు, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన

బోనకల్: పంటలకు కీలకమైన సమయాన యూరియా అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. బోనకల్ మండలం రావినూతల పీఏసీఎస్‌కు శనివారం 323 బస్తాల యూరియా రాగా, రావినూతల, ఆళ్లపాడు నుంచి దాదాపు 400మంది రైతులు చేరుకున్నారు. ఎవరికి వారే ముందు తమకు ఇవ్వాలని పట్టుబట్టడంతో తోపులాట జరిగింది. కాగా, ఆధార్ కార్డుల బదులు సాగు భూమి ఆధారంగా యూరియా పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఒకే కుటుంబంలో ఐదు ఆధార్ కార్డులు ఉంటే వారికి ఐదు బస్తాలు ఇస్తే, తక్కువ కార్డులు ఉన్న వారికి యూరియా లభించడం లేదన్నారు. ఈమేరకు ఎస్సై పి.వెంకన్న, ఏఓ పి.వినయ్‌కుమార్ రైతులకు నచ్చజెప్పి స్టాక్ ఉన్నంత మేర కూపన్ల ఆధారంగా పంపిణీ చేశారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



సామల దీప

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సామల దీప డాక్టరేట్ సాధించారు. ఉస్మానియా యూనివర్సిటీలో రసాయన శాస్త్ర విభాగంలో ప్రొఫెసర్ సీహెచ్.సరళాదేవి పర్యవేక్షణలో ఆమె పీహెచ్‌డీ పూర్తి చేయగా డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా తోటి అధ్యాపకులు దీపను అభినందించారు.

టీకాల ప్రక్రియ పరిశీలన

నేలకొండపల్లి: టీకాల కార్యక్రమాన్ని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్ రమణ శనివారం పరిశీలించారు. మండలంలోని నాచేపల్లి, నేలకొండపల్లి గ్రామాల్లో పర్యటించారు. స్వస్థ నారి స్వశక్త్ పరివార్ అభియాన్‌పై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న పలు పథకాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్ఈఓలు చంద్రశేఖర్, జ్యోతి, రాణి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఆరాధన.. బతుకమ్మ



ఖమ్మంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

- ఎంగిలిపూలతో ప్రారంభమై సద్దులతో ముగియనున్న వేడుకలు
- బతుకమ్మ నైవేద్యాలూ ప్రత్యేకమే..
- ఆనందోత్సాహాలతో ఆడి, పాడనున్న ఆడబిడ్డలు

ఖమ్మంగాంధీచౌక్: స్త్రీ శక్తిని గౌరవించే పండుగ.. ప్రకృతిని ఆరాధించడమే.. బతుకమ్మ పండుగ. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఈ పండుగ ప్రతీక. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలో ఇమిడి ఉంటుంది. ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుంచి తొమ్మిది రోజుల పాటు ఈ పండుగను జరుపుకోవటం ఆనవాయితీ. గౌరి పండుగ, సద్దుల పండుగ, పూల పండుగగా పిలుచుకుంటారు. మహాలయ అమావాస్య ఆదివారం నుంచి ప్రారంభమయ్యే పండుగ దుర్గాష్టమితో ముగుస్తుంది. తెలంగాణ గ్రామీణ సమాజంలో నవాబులు, భూస్వాముల పెత్తందారీలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. ఆ అకృత్యాలకు ఆత్మహత్య చేసుకున్న మహిళలను తలుచుకొని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. పాటల వెనుక ఉండే మర్మం ఇదే అని ప్రజల విశ్వాసం. కాగా, తెలంగాణ ఆవిర్భావం తరువాత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ పండుగకు ప్రాధాన్యత పెరిగింది. గతంలో కొన్ని చోట్ల మాత్రమే బతుకమ్మ ఆడేవారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత వాడవాడనా ఉత్సవాలు జరుపుకుంటున్నారు.

తొమ్మిది రోజుల పండుగ

బతుకమ్మ పండుగకు పుష్పాలే కళ. వానాకాలం చివరిలో శీతాకాలం ఆరంభంలో ఈ పండుగ వస్తుంది. ఈ సమయంలో నీటితో నిండిన జలాశయాల్లో తామర, కలువ వంటి పూలు లభిస్తాయి. తంగేడు, గునుగు, బంతి, చేమంతి, నంది వర్ధనం పూలు పూస్తాయి. సీతా ఫలాలు లభిస్తాయి. జొన్న పంట కోత సమయం. ఆడబిడ్డలు అత్తవారి ఇంటి నుంచి కన్న వారింటికి వచ్చి ఈ బతుకమ్మ పండుగను జరుపుకోవటం ప్రత్యేకత. తొమ్మిది రోజుల పాటు నిత్యం ఓ రకమైన నైవేద్యం సమర్పిస్తారు. మొదటి ఎనిమిది రోజులు నైవేద్యం తయారీలో యువతీ, యువకులు పాల్గొంటారు. చివరి రోజు సద్దుల బతుకమ్మ రోజున మహిళలు మాత్రమే నైవేద్యాన్ని తయారు చేస్తారు. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమై.. సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది.

→ **ఎంగిలి పూల బతుకమ్మ:** మహా అమావాస్య నుంచి ఎంగిలిపూల బతుకమ్మగా వేడుకలు ప్రారంభమవుతాయి. పెత్రామస అని కూడా అంటారు. నువ్వులు, బియ్యం పిండి, నూకలు కలిపి నైవేద్యం తయారు చేస్తారు.

→ **అటుకుల బతుకమ్మ:** ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నాడు చేస్తారు. సప్పిడి పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పిస్తారు.

→ **ముద్దపప్పు బతుకమ్మ:** ముద్దపప్పు, పాలు, బెల్లంతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

→ **నాన బియ్యం బతుకమ్మ:** నానేసిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం చేసి సమర్పిస్తారు.

→ **అట్ల బతుకమ్మ:** అట్లు లేదా దోశ నైవేద్యంగా సమర్పిస్తారు.

→ **అలిగిన బతుకమ్మ:** ఆశ్వయుజ పంచమి రోజున నిర్వహించే ఈ రోజున ఏ నైవేద్యాన్ని తయారు చేసి సమర్పించరు.

→ **వేపకాయల బతుకమ్మ:** బియ్యం పిండిని బాగా వేయించి వేప పండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.

→ **వెన్నముద్దల బతుకమ్మ:** నువ్వులు, వెన్న లేదా నెయ్యి బెల్లం కలిపి నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.

→ **సద్దుల బతుకమ్మ:** ఆశ్వయుజ అష్టమి. ఈ రోజున దుర్గాష్టమిని జరుపుకుంటారు. 5 రకాల నైవేద్యాలు తయారు చేస్తారు. పెరుగన్నం, చింత పండు పులిహోర, నిమ్మకాయ కలిపిన అన్నం, కొబ్బరన్నం, నువ్వులన్నం. తొమ్మిది రోజులు సమర్పించే నైవేద్యాలలో మొక్కజొన్నలు, జొన్నలు, సజ్జలు, మినుములు, శనగలు, పెసలు, పల్లీలు, నువ్వులు, గోధుమలు, బియ్యం, కాజు, బెల్లం, పాలు ఉపయోగిస్తారు.

ఈ పండుగ ఎంతో ప్రత్యేకం



బతుకమ్మ పండుగ అంటే ఎంతో ఇష్టం. ఇది ఆడబిడ్డల పండుగ. తెలంగాణ సంస్కృతికి ఈ పండుగ ప్రత్యేకం. పూర్వీకుల నుంచి వస్తున్న పండుగ. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చుతాం. నైవేద్యాలు తయారు చేసి గౌరమ్మకు సమర్పిస్తాం. ఆడబిడ్డల మంతా కలుసుకుంటాం. ప్రతి ఇంటా మహిళలు, ఆడబిడ్డల సందడి ఉంటుంది.

–అనుమోలు హైమావతి, దాబాలబజార్, ఖమ్మం

పూలను ఆరాధించే పండుగ



పూలను ఆరాధించే పండుగ బతుకమ్మ. తంగేడు, గునుగు పూల కోసం అడవులకు వెళ్లి తీసుకు వస్తాం. చెరువుల నుంచి కలువ, తామర పూలను తెచ్చుకుంటాం. పూలను సేకరించటం ఆనందంగా ఉంటుంది. ప్రతింటికి వెళ్లి పూల చెట్లు ఉంటే అడగి మరీ కోసుకు వస్తాం. బతుకమ్మ పండుగ 9 రోజులు ఇంట్లో అంతా సందడే.

–సౌమ్య, ప్రకాష్‌నగర్, ఖమ్మం

● కనిపించీ.. కనిపించనట్టు..



ఒకవైపు వర్షాలు దంచికొడుతుండగా.. మరోవైపు ఎండలు కూడా అదేస్థాయిలో ఉన్నాయి. సాధారణంగా వేసవికాలంలో ఎండమావులు ఏర్పడతాయి. అయితే శనివారం జిల్లాలో 34 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం – దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్‌హైవేపై ఎండమావులు కనిపించాయి.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్

బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



ఖమ్మంక్రైం: ఖమ్మం పాత బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని శనివారం పోలీసులు గుర్తించారు. ఈ నెల 18వ తేదీన జిల్లా ఆస్పత్రిలో కడుపు నొప్పికి చికిత్స చేయించుకున్నట్లు ఆయన వద్ద ఓపీ స్లిప్ లభించగా, దానిపై భద్రుగా పేరు ఉందని తెలిపారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59107, 87125 51370, 87126 59106 నంబర్లలో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

నోటరీల సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

ఖమ్మంలీగల్: నోటరీ పబ్లిక్‌ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌కు నోటరీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా జిరాక్స్ సెంటర్ల వద్ద 'నోటరీ చేయబడును'అనే బోర్డు పెట్టి నోటరీలు చేస్తుండడం వల్ల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరణించిన వారి స్టాంపులు ఉపయోగించడం, ఒకేసారి ఖాళీ స్టాంప్ పేపర్లపై సంతకాలు చేసివ్వడం వంటివి చేస్తున్నారని చెప్పారు. జిరాక్స్ సెంటర్లు, టైపిస్టుల నోటరీ దందా, నకిలీ నోటరీల గుర్తింపు వంటి వాటిపై దృష్టి పెట్టాలని కోరారు. నోటరీ పబ్లిక్ సంఘం అధ్యక్షుడు పారుపల్లి అమర్‌చంద్, ప్రధాన కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్‌చౌదరి, కోశాధికారి మందా రెడ్డెయ్య పాల్గొన్నారు.

సౌత్ జోన్ అథ్లెటిక్స్ మీట్‌కు జిల్లా క్రీడాకారులు

ఖమ్మంస్పోర్ట్స్: ఏపీలోని గుంటూరు నాగర్జున యూనివర్సిటీలో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జరుగున్న దక్షిణ భారత అథ్లెటిక్స్ మీట్‌లో జిల్లా నుంచి 10 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. వారిలో ఎ.గౌతమ్, ఎస్.గోపిచంద్, కె.అశోక్, డి.వివేక్‌చంద్ర, కె.మస్తాన్, ఎస్.కె.ముబీన్, ఎస్.కె.ఆఫ్రీన్, బి.వైశాలి, బి.బిందు, ఎ.మనుశ్రీ ఉన్నారు. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులను డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి, అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్‌అహ్మద్, ఉదయ్‌కుమార్ అభినందించారు.

పల్లె దవాఖాన పరిశీలన

కొణిజర్ల: మండలంలోని పల్లిపాడు గ్రామంలోని పల్లె దవాఖానను శనివారం డీఎంహెచ్ఓ కళావతి బాయి పరిశీలించారు. దవాఖాన నిర్మించి రెండేళ్ల గడుస్తున్నా నిరుపయోగంగా ఉండటంతో స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించారు. రోడ్డు కంటే దిగువన ఉండటం, వాగు కావడం వల్ల నిత్యం నీరు పారుతోందని, ఆస్పత్రికి రోడ్డు సౌకర్యం లేక ఆస్పత్రి నిర్వహణ కుంటు పడిందని స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు. కలెక్టర్‌కు నివేదించి నిధుల కేటాయింపునకు కృషి చేస్తానని డీఎంహెచ్ఓ హామీ ఇచ్చారు. వైద్యాధికారి శారద పాల్గొన్నారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

కొణిజర్ల: అనుమతులు తీసుకున్న ప్రాంతం నుంచి కాకుండా మరో ప్రదేశం నుంచి మట్టి తోలుతున్న టిప్పర్లను మైనింగ్ అధికారులు అదుపులోకి తీసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించిన ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని తనికెళ్లకు చెందిన భూమిలోని గుట్టల నుంచి ఓ వ్యక్తి రోడ్డుకు మట్టి తోలేందుకు అనుమతులు తీసుకున్నాడు. అయితే అక్కడి నుంచి కాకుండా మరో ప్రాంతం నుంచి మట్టి ప్రైవేట్ వెంచర్లకు తరలిస్తున్నాడు. విషయం తెలుసుకున్న మైనింగ్ అధికారులు 5 టిప్పర్లను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వాటిని సీజ్ చేశామని పోలీసులు తెలిపారు.

బోనకల్‌లో..

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తోలకాలు జరుపుతుండడంతో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. మూడు టిప్పర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి మైనింగ్ శాఖకు అప్పగించినట్లు ఎస్ఐ పాదిలి వెంకన్న తెలిపారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బోనకల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు మండలంలోని లక్ష్మీపురం నుంచి బోనకల్ వరకు శనివారం పాదయాత్ర నిర్వహించారు. అనంతరం బోనకల్ తహసీల్ ఎదుట ధర్నా చేశాక.. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడారు. ఎలాంటి పక్షపాతం లేకుండా.. రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని, లేనిపక్షంలో డిప్యూటీ సీఎం భట్టి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ రమాదేవికి అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మడిపల్లి గోపాల్‌రావు, పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేశ్, గుడ్డూరు ఉమ, బంధం శ్రీనివాసరావు, చిట్టిమోదు నాగేశ్వరరావు, తెల్లాకుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'బొమ్మ' కాలేజీకి మరో పేటెంట్



పేటెంట్ పత్రంతో చైర్మన్, అధ్యాపకులు, విద్యార్థులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని బొమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీకి మూడో పేటెంట్ లభించింది. గతంలో రెండు పేటెంట్లు ఉండగా, తాజాగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ విభాగం నుంచి 'వేరియబుల్ ఏఐ పవర్ డ్రగ్ డెలివరీ పరికరం'పేటెంట్ పొందిందని బొమ్మ విద్యాసంస్థల చైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. వివిధ వ్యాధులతో చికిత్స పొందుతున్న వారికి మందులు అందించే విధానంలో ఈ పరికరం విప్లవాత్మక మార్పులు తీసుకొస్తుందని, నోరు లేదా ఇంజక్షన్ రూపంలో కాకుండా కృత్రిమ మేధస్సు (ఏఐ) అనుసంధానమై చర్మం ద్వారా ఔషధం సరఫరా చేయొచ్చని వెల్లడించారు. మైక్రో నీడిల్స్, రియల్ టైమ్ సెన్సార్లు అమర్చి ఉండడంతో హృదయ స్పందన రేటు, గ్లూకోజ్ స్థాయి ఆధారంగా ఔషధ మోతాదు మారుతుంటుందని తెలిపారు. వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. 2022 నుంచి జరుగుతున్న పరిశోధన ఫలితంగా వరుసగా మూడు పేటెంట్లు రావడం ఆనందంగా ఉందని చెప్పారు. చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు కళాశాల సెక్రటరీ ఊదారు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌భాస్కరరావు, మేనేజ్‌మెంట్ సభ్యులు బొమ్మ లక్ష్మీరాజ్యం, మాధవి, అనూష తదితరులు అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు. కాగా, ఇన్వెంటర్లుగా డాక్టర్ విజయ్‌భాస్కరరావు, డాక్టర్ కిరణ్‌జ్యోతి, సంతోష్, సుచరిత, మనీషా, విద్యార్థినులు అనూష, తేజస్విని, భార్గవి, స్నేహ వ్యవహరించారని తెలిపారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్ ఏర్పాటుపై ఉద్రిక్తత

చింతకాని: మండలంలోని కొదుమూరు గ్రామ సమీపంలో దేవరపల్లి – సూర్యాపేట జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి లోలెవెల్ వంతెన వద్ద హైటెన్షన్ విద్యుత్ లైన్‌ను ఏర్పాటు చేసే విషయంలో శనివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పైనుంచి విద్యుత్ లైన్ వెళ్లే విధంగా ఇరువైపులా భారీ విద్యుత్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారు. టవర్ ఏర్పాటు చేసే ప్రాంతంలో ఒక రైతుకు అనుకూలంగా మార్చి ఎన్నో ఏళ్లుగా ఉన్న డొంక దారిలో వేస్తున్నారని రైతులు అభ్యంతరం తెలిపారు. దీంతో అక్కడ వివాదం చోటుచేసుకుంది. తహసీల్దార్ బాబ్జీప్రసాద్ రైతులతో చర్చించి కేవలం ఇద్దరు, ముగ్గురు రైతుల నుంచి సంతకాలను తీసుకుని డొంక రహదారికి మధ్యలో విద్యుత్ టవర్ ఏర్పాటు చేస్తున్నారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో 650 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, ఈ డొంక రహదారిలోనే వ్యవసాయ పనిముట్లు, పంట ఉత్పత్తులను తీసుకెళ్తారని, ఒకరిద్దరి ప్రయోజనం కోసం ఏళ్ల తరబడి స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకున్న డొంక రహదారిని మార్చటంపై మండిపడ్డారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు రైతులు చెప్పారు. వైరా సీఐ సాగర్ ఆధ్వర్యంలో చింతకాని ఎస్ఐ వీరేందర్‌తో పాటు సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్ఐలతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి నిర్మాణానికి అడ్డంకులు లేకుండా విద్యుత్ టవర్ ఏర్పాటు కోసం డొంకదారిలో కొద్దిగా మార్పులు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

190 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

ఖమ్మంరూరల్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు ప్రాంతాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులను ఖమ్మం సీసీఎస్, ఖమ్మం రూరల్, రఘునాథపాలెం పోలీసులు శనివారం పట్టుకున్నారు. రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి వివరాలు వెల్లడించారు. రఘునాథపాలెం మండలం రేగులచెలక గ్రామానికి చెందిన జంగా వెంకన్న, వెల్లబోయిన లక్ష్మణ్‌రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎదురుగడ్డ ప్రాంతానికి చెందిన వల్లపు సంపత్ కలిసి ఓ ముఠాగా ఏర్పడి కొంత కాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. సీసీఎస్, సివిల్ పోలీసులు సంయుక్తంగా వీరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఖమ్మంరూరల్ మండలం కామంచికల్, గొల్లగూడెం, మద్దులపల్లి, నేలకొండపల్లి, ఖానాపురం, కల్లూరు, రఘునాథపాలెం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. నిందితుల నుంచి 190 గ్రాముల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ రూ.20 లక్షలు ఉంటుందని ఏసీపీ వివరించారు. రూరల్ సీఐ ముష్క రాజు సీసీఎస్ ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పండుగ వేళ పస్తులేనా?

- వేతనాలు అందక చిరుద్యోగుల ఇక్కట్లు
- మల్టీపర్పస్ వర్కర్లు, ఆపరేటర్లకు ఎదురుచూపులే



విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ వర్కర్లు

ఎర్రుపాలెం: రెక్కాడితే కాని డొక్కాడని వేలాది మంది చిరుద్యోగులకు నెలలు తరబడి జీతాలు రావడం లేదు. చిరుద్యోగులు కావడంతో బయట అప్పు కూడా సక్రమంగా పుట్టడం లేదు. సకాలంలో జీతాలు అందక కుటుంబాలను ఎలా పోషించాలో దిక్కుతోచని స్థితిలో గ్రామ పంచాయతీల మల్టీపర్పస్ వర్కర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఉద్యోగులకైతే ఠంచన్‌గా నెలవారీ జీతాలు ఇస్తూ తమను ఇబ్బందుల పాలుచేయడం సమంజసమా అని చిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

అన్ని పనుల్లోనూ కీలకం

తెల్లారితే చాలు గ్రామాల్లో చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులతో పాటు అన్ని రకాల పనులు చేస్తున్న పంచాయతీ వర్కర్ల బాగోగులను జిల్లా అధికార యంత్రాంగం, పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. వర్కర్లతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ వర్కర్లు ఎదురు చూస్తున్నా పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో అల్లాడుతున్నారు. జిల్లాలో 2 వేల మంది మల్టీపర్పస్ వర్కర్లున్నారు. వారికి ప్రభుత్వం రూ.9500 జీతం ఇస్తోంది. అది కూడా ప్రతీ నెల ఇవ్వక కుటుంబాలు గడవని పరిస్థితి నెలకొంది.

కంప్యూటర్ ఆపరేటర్లదీ అదే పరిస్థితి

జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయాల్లో 76 మంది కంప్యూటర్ ఆపరేటర్లున్నారు. వీరికి నెలకు రూ.19,500 జీతం ఇస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.22,750 ఇచ్చేవారు. అలాంటిది రూ.3 వేలు తగ్గించారు. జీతాలు పెంచాల్సింది పోయి తగ్గించడం ఏ మేరకు సమంజసమని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవి కూడా మూడు నెలలుగా ఇవ్వడం లేదు. కంప్యూటర్ ఆపరేటర్లు మండల పరిషత్ కార్యాలయానికి, పంచాయతీలకు సంబంధించిన పలురకాల విధులు నిర్వహిస్తున్నారు.

రెండు, మూడు రోజుల్లో జమ చేస్తాం



పంచాయతీ వర్కర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు మూడు నెలలుగా జీతాలు పెండింగ్ ఉన్న మాట నిజమే. కొన్ని కారణాల వల్ల చెల్లింపులు జరగలేదు. మరో రెండు, మూడు రోజుల్లో వర్కర్లకే కాక ఆపరేటర్ల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తాం

–ఆశాలత, జిల్లా పంచాయతీ అధికారి

కుటుంబాల పోషణ ఎలా?



మూడు నెలలుగా జీతాలు లేకపోతే కుటుంబాలను ఎలా పోషించాలి. మాకొచ్చేదే తక్కువ జీతం కావడంతో అప్పు కూడా పుట్టడం లేదు. సకాలంలో జీతం చెల్లించాలని కోరినా ఫలితం లేదు. ఇకనైనా ప్రభుత్వం మా పరిస్థితి అర్థం చేసుకోవాలి.

–గంతాల నాగేశ్వరరావు, మల్టీపర్పస్ వర్కర్, మామునూరు

పెండింగ్ జీతాలు చెల్లించాలి



మూడు నెలలుగా ఉన్న పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి. గతంలో మాకు వచ్చే రూ.22,750 జీతంలో రూ.3,200 తగ్గించారు. గత పదేళ్లుగా విధులు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వం జీతాలు పెంచడమేకాక ప్రతీనెల క్రమంగా చెల్లించాలి.

–పారా జోజిరాణి, కంప్యూటర్ ఆపరేటర్, ఎర్రుపాలెం